శ్రీ రమణ జ్యోతి | Sri Ramana Jyothi

అక్టోబర్ 2020 | October 2020

ఈ సంచికలో ... | IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.యస్. గారి 75వ ప్రవచనం | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్) | జి. శ్రీహరిరావు | 10 |
| 3. | సాధనా చతుష్టయం | డా॥ వి. రామదాస్ మూర్తి | 17 |
| 4. | శ్రీరమణ మానసము | బిరుదవోలు లక్ష్మమ్మ | 24 |
| 5. | అందరూ శవవాహకులే | శ్రీవత్సస | 27 |
| 6. | The Greatness of Gandhiji | Dr. K. Subrahmanian | 30 |
| 7. | Kavyakantha's Chatvarimsat | V. Krithivasan | 39 |
| 8. | Prapatti Astakam | V. Krithivasan & Sneha Choudhury | 42 |
| 9. | Aandavan - The Lord | | 44 |
| 10. | Darling Ramana | V. Ganesan | 46 |


**Events in Sri Ramana Kendram in October 2020**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 10th October - Punarvasu Satsang - 6.00 - 7.00 p.m.

(Devotees may please note that due to Social distancing, satsangs are being held online. For details please contact Kendram Office)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# గురువు - దిశానిర్దేశం

డా॥ కే.యస్. గారి 75వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అన్నారు. జ్ఞానం పొందాలంటే నమ్మకం వుండాలి. కాని ఆధ్యాత్మిక విషయాల మాటకొచ్చేసరికి మనం సరియైన మార్గం అనుసరిస్తున్నామా అని ప్రశ్నించుకుంటాం. నిర్ణయించుకున్న లక్ష్యాన్ని గురువు చేరుస్తాడా అని భరోసా కావాలని అంటాం. నిత్యజీవితంలో మాత్రం మనం నమ్మకాన్ని ప్రదర్శిస్తాం. ఇతరుల మీద నమ్మకం పెట్టుకుంటే తప్ప ఒక్కరోజు కూడ గడవదు. మన పిల్లలు పాఠశాలకు వెళ్తారని నమ్ముతాం. ప్రతి రోజూ వాళ్ళ వెంబడి మనం వెళ్ళం. మన క్రింద పనిచేసే వాళ్ళు సమయానికి వస్తారని నమ్ముతాం. వ్యక్తులు సత్యం చెబుతారని నమ్ముతాం. లేకుంటే శిక్షిస్తాం. ఏ విజయవాడకో రైలు టికెట్ కొని స్టేషన్ మాస్టర్ వద్దకు వెళ్ళి డ్రైవర్ క్షేమంగా తీసుకెళతాడా? పేరేమిటి? త్రాగడు కదా? అని అడగం. అంతా సవ్యంగా జరుగు తుందని నమ్ముతాం. ఈ ప్రపంచంలో అన్నిటిని ప్రొద్దుటి నుండి రాత్రి వరకు నమ్మకంతో గడుపుతాం. ఏ అనుమానాలు పెట్టుకున్న ప్పటికీ ఒకరోజు కూడ గడవదు. ఆఖరుకు పడుకోబోయే ముందు రేపు మళ్ళీ లేస్తామన్న నమ్మకంతో పడుకుంటాం. ఎవరో నిద్రలోనే చనిపోయారన్న వార్త విన్నప్పటికీ, మనకు అలా జరగదు లెమ్మను కుంటాం. లేకుంటే ఒక రోజూ గడవదు.

## గురువు సూచనలను పాటించడం మన విధి

గురువుగారి సూచనల విషయంలో మాత్రం మనకు ఎక్కడ లేని అనుమానాలు వస్తాయి. ఆయన చెప్పింది సరియైనదేనా, సరియైన లక్ష్యాన్ని చేరుస్తాడా అని ఎన్నో సందేహాలు వస్తాయి. ఇక్కడే మనం జాగ్రత్తగా వుండాలి. ఒక గురువును ఎంచుకున్నప్పుడు ముఖ్యమైనది ఆయన చెప్పినదాని ప్రకారం నడుచుకొనడమే విధి. అలా కాకుంటే నష్టపోయేది ఆయన కాదు. జీవితంలోని పలు విషయాలలో మన పరిమిత మేధస్సుతో సరిగా అర్థం చేసుకొన లేనివి ఎన్నో వుంటాయి. ఉదాహరణకు ప్రతి నిత్యం ఎన్నో కావాలని కోరుకుంటాం. వాటి కోసం ఎంతో కష్టపడతాం కూడ. ఎంతో ఒత్తిడి, మనోవ్యాకులతకు గురి అవుతాం. లభిస్తుందా లేదా, ఎవరి దగ్గరకు వెళితే ఫలిస్తుంది, సిఫార్సులు అవసరమా ఇలా ఆలోచనలు సాగుతాయి. అందుబాటులోనికి వచ్చినప్పుడు అప్పటికి సంతోషంగా వుంటుంది. కష్టపడి సాధించిన కొన్ని రోజులకే మరొక వాంఛ కలుగుతుంది. అలా జీవితమంతా శ్రమపడడం సాధించడం, కొంతకాలం తృప్తిగా వుండడంతోటే మళ్ళీ క్రొత్త వేట మొదలు. అలాగ వస్తువుల మీద, వ్యక్తుల మీద అదుపు కావాలనే వాంఛ సాగుతూనే వుంటుంది.

ప్రేమ అనే పదాన్ని పలు విధాలుగా నిర్వచించవచ్చు. ప్రేమ చూపడం అంటే అవతలి వ్యక్తికి తనను తాను సమర్పించుకోవడం. అతని నుండి ఏమీ ఆశించకుండ సమర్పించుకుంటే, వారు కూడ అదే విధంగా ప్రవర్తిస్తారు. అలాకాకుండ ఏమైనా కావాలని తెలిపితే



అతను తనకు సమయం లేదనో కుదరదనో సమాధానం చెబుతాడు. ఎప్పుడూ ఏదో అడుగుతూ వున్న వారిని ప్రోత్సహించం. అలాగే మన మీద అదుపు చూపాలని ప్రయత్నించే వారిని కూడ దగ్గరకు రానివ్వం. ఏమీ అడగనివారికి ఏమైనా చేయడానికి సిద్ధంగా వుంటాం.

విపరీతమనిపించే మరొక విషయమేమంటే ఇతరుల నుండి ఏమీ కాంక్షించకుండ కూడ వాళ్ళ పట్ల ప్రేమ ప్రదర్శిస్తే ఆఖరకు ధన్యవాదాలు కూడా కోరకుంటే ఈ ప్రపంచం ఏమైనా ఇవ్వడానికి సిద్ధపడుతుంది. నిత్యజీవితంలో మనం గమనించేది ఏమిటంటే అలా నడుచుకొనడం ఆచరణకు వీలుకాని విషయమని భావిస్తాం. కాని అదే సమయంలో మనం ఎందరో స్వామీజీలు, గురువులను ఆశ్రయిస్తాం. ఎవరు వాళ్ళు? నిజమైన సాధువుకు స్వంతమంటూ ఏమీ వుండదు. అసలు తననే స్వంతమని గుర్తించడు. తనకు శరీరం అంటూ ఒకటి వుందనీ, దానికి సదుపాయాలు కావాలని, విశ్రాంతి కావాలని, ఎప్పుడూ ఆలోచించడు. తన సమయం, శక్తి నంతటినీ, ఇతరుల కోసం వినియోగిస్తాడు. ఆయనను సమీపించిన వారు ఆయనకు తాము చెందినవారమని భావిస్తారు. అద్భుతమైన వారని అనుకుంటారు. పెద్ద గుంపులో కలిసి అలాంటి గొప్ప వారి దర్శనానికి వెళ్ళినప్పుడు కూడ, ఒక క్షణం పాటు దర్శనం దూరం నుండి కలిగినప్పటికీ, ఎంతో సంతోషంగా తిరిగి వస్తాము. ఇతరులకు ప్రేమతో అర్పించుకుని వారి నుండి ఏమీ ఆశించని స్థితి చేరడానికి దైవకృప తప్పక అవసరం. అలాంటి స్థితిలో మన

గురించి మనం ఆలోచించం. అలాగని మన నిర్ణీత విధులను మరచి ప్రవర్తించడం భావ్యం కాదు. ఏదో జడపదార్థంగా వుండడం కాదు. మనం ఏదో ఒక కారణం కోసం జన్మించాం. ఒక ఉన్నత శక్తి కొన్ని పనుల కోసం ఉపయోగించడానికి జన్మనిచ్చింది. ఎవరెవరి వాసనలను బట్టి ఆ శక్తి సరియైన దారిలో నడిపిస్తుంది.

## దేశికులు దిశా నిర్దేశం చేస్తారు

సంస్కృతంలో 'దిశ' అన్న పదం వాడుకలో వుంది. దిశ అంటే 'దిక్కు' - మనం వాడే తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం - ఇలాంటివి. ఒక దేశం యొక్క చిత్రపటాన్ని చూస్తే మనకు దేశపు ఎల్లలు తెలుస్తాయి. వివిధ దిక్కులలో ఏమేమి వున్నాయి అర్థమౌతుంది. దేశం హద్దులు ఏ దిక్కులో ఎక్కడి దాకా వున్నాయో బోధపడుతుంది. వాటి ఆధారంగా ఆయా చోట్లకు వెళ్తాము. ఇక 'ఉపదేశం' అంటే ఆధ్యాత్మిక జీవనాన్ని గడపడానికి ఇవ్వబడిన ముఖ్యమైన సూచనలు అని అర్థం. అలాగే 'ఆదేశం' 'సందేశం' అన్న పదాలు వాడుకలోకి వచ్చాయి. గురువు ఇచ్చే సూచనలను 'ఉపదేశం' అంటాము. 'ఉప' అంటే పలు అర్థాలున్నాయి.

సజీవ గురువు చాలా ముఖ్యం అని భావిస్తారు. కాని మన యోగ్యతను బట్టి మనకు గురువు లభిస్తారు. ఏమైనా మనకు లభించిన గురువును నమ్మి, శ్రద్ధ చూపిస్తే, అతను మీకు ఆశ్రయం ఇస్తారు. బాహ్యమైన ఆర్భాటాలను పట్టించుకోవలసిన అవసరం లేదు. అందరూ ఒకేలాగ కనిపించరు. ముఖ్యమైన విషయమేమంటే మనకు గురువు పై యథార్థంగా నమ్మకం కుదిరినప్పుడు, మనకు



ఏమి ఎంత అవసరమో అని తెలుసుకుని నిజమైన గురువు తగిన ఉపదేశం, దిశా నిర్దేశం చేస్తారు. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అన్నది ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయం. గురువు అప్పుడు సరియైన మార్గాన్ని చూపుతాడు. అందుకే గురువును 'దేశిక' అని అంటారు. ఆ సరియైన మార్గం మనకు తెలియనందువల్ల మార్గదర్శకులైన 'దేశికు'ల అవసరం వుంది.

గురువు ద్వారా మనకు లభించేది ఏమిటి? నిత్యజీవితంలో మనం తరచు చిన్న విషయాలకు సంతోషాన్ని పొందుతాము. కాని అవి తృటికాలంలో సమసిపోతాయి. ఇక జీవనాధారం కోసం ఏవో చేయవలసి వుంటుంది. వాటివల్ల మనకు లభించేవి ఎక్కువైతే కూడ సంతోషాలు మాత్రం శాశ్వతమైనవిగా వుండవు. ఇంకా ఏదో కావాలన్న ఆకాంక్షలు మిగిలిపోతూనే వుంటాయి. గురుకృప లభించినప్పుడు పరిస్థితి మారుతుంది. ప్రతిదీ ఆ ప్రభువు యొక్క చిత్తమనే సంకల్పం కలిగేలా జరుగుతుంది. చేయవలసిన కర్తవ్యాన్ని ఏమీ ఆశించకుండా చేయగలిగే అపూర్వమైన శక్తి లభిస్తుంది. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే దృఢత్వం ఇవ్వబడుతుంది.

## మన ఆరాటం దేనికి?

మనకే తెలియకుండ మనం దేనికోసం ఆరాటపడుతున్నాం? మనం కోరుకునేది దుఃఖంతోను, కలవరంగా వున్నప్పుడు స్థిరమైన మనస్సు, ప్రశాంతంగా వుండే మనసు. దాని కోసం ఎన్నో విధాల ప్రయత్నిస్తున్నాం. అందుకే పూజ, ధ్యానం ఇలా ఎన్నో చేస్తుంటాం. కాని మరొక విషయం గురించి ఆలోచించం. సంతోషంగా

వున్నప్పుడు కూడ మనసు స్థిరంగా వుండకుండ మరో రకమైన అలజడితో వుంటుంది. మనం కోరుకునేది శాంతి. అంటే శుభప్రదం లేదా అశుభమైన ఎలాంటి పరిస్థితుల్లోను మనసు మాత్రం నిశ్చలంగా వుంటుంది. రెండింటిని ఒకే విధంగా గ్రహించే అసాధారణ స్థితికి చేరుతుంది. ఏ ఆనందమైనా చిరకాలం సాగదని మనం ఆశించే ఆనందం కూడ మనసును చలింపజేస్తుందన్న భావన కలిగి, మనసు స్థిరత్వం చెదిరిపోతుందని తెలుసుకున్న క్షణం గురువు, సుఖ, దుఃఖాల పట్ల నిర్లక్ష్య ధోరణిని ప్రసాదిస్తాడు. సుఖ, దుఃఖాలు ఒకే నాణ్యం యొక్క బొమ్మ, బొరుసులు. నిద్రావస్థలో మనం ఏ అలజడి లేకుండ ఎంతో ప్రశాంతతను అనుభవిస్తాం. మెలకువలోను, గాఢ నిద్రావస్థలోను మనకు మంచి నిద్రలో అనుభవించే శాంతియే వుంటుంది. కాని జాగ్రతావస్థలో మనం చురుకుగా వుంటాం. నిద్ర పోతున్నప్పుడు మనసు వుండదు. అందుకే తన గురించి కూడ తనకు తెలియదు.

జ్ఞానికి కర్తృత్వ భావన వుండదు గనుక నిత్య ప్రశాంతత చోటు చేసుకుంటుంది. పనులు అనాలోచితంగా జరిగిపోతుంటాయి. తమ కోసం వారు ఏమీ చేయరు. ఇతరులకు తమను అర్పించు కుంటారు. మనం అలాగే ఇతరులకు వాంఛలేవీ లేకుండా అర్పించుకుంటే ఏ రకమైన పరస్పర విరుద్ధ భావనలకూ చోటే వుండదు. వేదాలు, ఉపనిషత్తులు ఇదే విషయాన్ని ఘోషిస్తాయి. పరస్పర ద్వంద్వ భావాలు మనసు వల్ల ఉత్పన్నమౌతాయి. అవతలి వారిని ప్రేమించినప్పుడు ఇదే జరుగుతుంది. ఇది పురుషులు, స్త్రీల మధ్య ప్రేమ గురించి మాత్రమే కాదు. కుటుంబంలో చిన్న



పిల్లలు అమాయకంగా తప్పుడు మాటలు మాట్లాడినప్పుడు మనం పట్టించుకోము. పైగా ఇతరులకు సంతోషంగా చెప్పుకుంటాము కూడ. వ్యక్తిత్వ భావనకు, అహానికి అవకాశం వుండదు. గురువు మన పట్ల చూపే ప్రేమ, కరుణ అలాంటిది.

## గురువు మనల్ని మరువడు

గురువును మనం ఏమరుపాటుతో మరచిపోయినప్పటికీ, గురువు నమ్ముకున్నవారిని ఎన్నటికీ మరువడు. గురుకృప మనల్ని మళ్ళీ వారి దాపునకు తీసుకెళ్తుంది. ఊహకందని రూపాలలో మనకు శ్రేయస్సును అందిస్తాడు. అసాధారణమైన రీతిలో తాము ఏదో మంచిని ప్రసాదిస్తున్నామని మనకు తెలియనివ్వడు కూడ. తాత్కాలికంగా ఆయన పట్ల నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించినా పట్టించు కోడు. తల్లి లాంటివాడు. నిజానికి, తల్లికంటే గొప్పవాడు. అందుకే భగవాన్ గురుకృప గురించి పదేపదే నొక్కి చెబుతుండేవారు. ఆ విషయాన్ని మనం తరచు గుర్తు చేసుకుంటూ వుండాలి. ఆ స్పృహ మనలో వుంటున్నంత కాలం దేవుని ద్వారా ప్రవహించే దయా సముద్రాన్ని ఆయన కురిపిస్తుంటారు. అన్ని పరిస్థితుల్లోను అతి నెమ్మదిగా వుండే లక్షణం అబ్బుతుంది. అది మరెవ్వరో చెప్పవలసిన అవసరం లేదు. గురుకృప లభించినప్పుడు ఏదీ అసాధ్యం కాదు. అన్నీ భగవదేచ్ఛ అనే గాఢ నిర్ణయానికి వస్తాం. తగిన సమయంలో ఆయనే మనల్ని అవసరమైన పనిముట్టుగా వాడుకుంటాడు. ఈ భావన మనలో జీర్ణించుకుని పోయినప్పుడు గురువు వేరుకాదని, గురువు, దేవుడు, కృప, అన్నీ ఒకటే అన్న భావన నాటుకుపోతుంది. అవి అన్నీ ఒకే భావనకు రూపాంతరాలని మనకు బోధపడుతుంది.

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

అనువాదం: జి. శ్రీహరిరావు

### ముందుమాట

(శ్రీ దేవరాజ ముదలియార్ గారు 1900 సం॥లో కార్తీక దీపదర్శన సందర్భంగా బంధువులతో తిరువణ్ణామలై వెళ్ళినప్పుడు భగవాన్ శ్రీరమణమహర్షి (అప్పుడు బ్రాహ్మణస్వామి)ని మొదటిసారి దర్శించుకున్నారు. తరువాత చిత్తూరులో న్యాయవాద వృత్తిలో వున్నప్పుడు పలుసార్లు మహర్షి దర్శనం చేసుకుంటూ వుండినప్పటికీ 1940 సం॥లో రమణాశ్రమ ప్రాంగణంలోనే ఆశ్రమాధికారుల అనుమతితో ఒక గదిని నిర్మింప జేసుకుని అంతేవాసి అయ్యారు.

చిన్నప్పటి నుండి ఆధ్యాత్మిక భావాలు కలిగిన ముదలియార్ గారు మహర్షి ప్రభావానికి పూర్తిగా లోనై తమను 'రమణశై' (రమణుల బిడ్డ) అని పిలుచుకుని అలాగే ప్రవర్తించారు కూడ. రమణులతో ప్రత్యేక అనుబంధం పెంచుకున్న అతి కొద్దిమంది భక్తులలో ముదలియార్ గారు అగ్రగణ్యులు. నిజానికి, 'శరణాగతి' అన్న పదానికి నిర్వచనమన్నట్లు, ఆయన దైహికంగా, ఆధ్యాత్మికంగా తమ జీవన పయనాన్ని భగవాన్ మార్గదర్శకత్వంలో సాగనిచ్చారు.

శ్రీరమణకేంద్ర చిరకాల భక్తులు శ్రీ జి. శ్రీహరిరావుగారు శ్రీదేవరాజ ముదలియార్ రచించిన "శ్రీరమణ మహర్షి - స్మృతులు" అన్న గ్రంథాన్ని తెలుగులోకి అనువదించారు. ఆ అనువాద రచనలో



నుండి భాగాలను ధారావాహికంగా ఈ సంచిక మొదలుకొని శ్రీరమణ జ్యోతి పత్రికలో ప్రచురిస్తున్నాం. - సంపాదకుడు)

### పరిచయం: శ్రీదేవరాజ ముదలియార్

ఈ గ్రంథ రచయిత శ్రీదేవరాజ ముదలియార్ "అనుదినమూ శ్రీరమణులతో" అను బహుప్రసిద్ధ గ్రంథమును కూడా రచించారు. శ్రీభగవాన్‌తో ఎంతో స్వతంత్రముగా వుంటూ, వారితో ఒక ప్రత్యేక మయిన బాంధవ్యమును యేర్పరుచుకున్న బహుకొద్ది భక్తులలో శ్రీ ముదలియార్ ఒకరు. సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూప మయిన శ్రీ భగవాన్ సన్నిధిలో, చాలామంది భక్తులు వారితో చనువుగా మెలగడానికి జంకేవారు. కానీ, శ్రీ ముదలియార్, ప్రొ. సుబ్బరామయ్యగారివలె, శ్రీ భగవాన్ పట్ల అత్యంత భక్తి ప్రపత్తులతో పాటు, ఎంతో స్వతంత్రంగా మెలిగేవారు. శ్రీకృష్ణుని విశ్వరూప దర్శన భాగ్యము కలిగిన అర్జునుడు, ఆయన పట్ల చూపిన చనువే, శ్రీ ముదలియార్ శ్రీ భగవాన్ పట్ల ప్రదర్శించేవారు.

ముదలియార్ గారికి శ్రీ భగవాన్ పరబ్రహ్మ స్వరూపులేకాక, తన కత్యంత గౌరవనీయులైన గురువులు, అటు స్వర్గములోనూ, యిటు భూమి మీదా తనను కాపాడు పితృదేవులు. శ్రీభగవాన్‌తో ఆయన చతురోక్తులాడేవారు; ప్రశ్నలు కురిపించేవారు; కీర్తనలు పాడేవారు; తన బాధలన్నీ చెప్పుకునేవారు. ఈ పుస్తకములో శ్రీభగవాన్ హాస్యము పలుచోట్ల వ్యక్తమవుతుంది. ఎప్పుడు కూడా వారు యితరులను నొప్పించకుండా, తమ మీద తామే చతురోక్తులు విసురుకునేవారు. భక్తుల క్షేమము - ఐహికము, పారమార్థికము

- కొరకు శ్రీ భగవాన్ తీసుకున్న శ్రద్ధ, యీ పుస్తకములో ప్రస్ఫుట మవుతుంది. వారి సన్నిధిలో భక్తులనుభవించిన దివ్యానందమూ, స్వేచ్ఛ, శ్రీ భగవాన్ సమదృష్టి, యీ గ్రంథములో మనకు గోచరమౌతాయి.

## పీఠిక

శ్రీ భగవాన్ మహాసమాధి తరువాత, శ్రీరమణాశ్రమ ప్రచురణల ఉపసంఘము, ముఖ్యముగా డా. కృష్ణస్వామిగారు, శ్రీ భగవాన్ స్మృతులను రాయవలసినదిగా నాకు సూచించారు. ఎందువలనో నాకప్పుడు రాయాలనిపించలేదు. ఆ తరువాత కొన్ని నెలల వరకూ, దాదాపు ప్రతి సాయంత్రమూ, నా స్నేహితులు కీ.శే. పి. రామస్వామి అయ్యరు గారి కుటుంబసభ్యులను మద్రాసు త్యాగరాయ నగరులో వారింట్లో కలుసుకుంటూ వుండేవాడను. అందరూ శ్రీభగవాన్ భక్తులమే కనుక మా సంభాషణలన్నీ మన శ్రీభగవాన్ గురించే వుండేవి. ఈ పుస్తకములో రాయబడిన జ్ఞాపకాలన్నీ అప్పటి సంభాషణలే. ఆ కుటుంబ సభ్యులందరూ, ముఖ్యముగా కు.ఆర్. వజ్రేశ్వరి, నేను మరచిపోక ముందే శ్రీ భగవాన్ గురించిన నా అనుభవాలు వ్రాతపూర్వకంగా రాసి వుంచాలని పట్టుబట్టారు. ఆమె ఎమ్.ఎ. ఎమ్ఇడి. మద్రాసు క్రైస్తవ మహిళా కళాశాలలో అధ్యాపకురాలు. ఈ పుస్తకము రాయడానికి ఆ కుటుంబమే కారణము. వారి తరువాత నేను కృతజ్ఞత ప్రకటించ వలసిన వ్యక్తి, నేనెంతో గౌరవించే నా స్నేహితులు ప్రొ. స్వామినాథన్ గారు. పుస్తకాన్ని చదివి నన్నెంతో ప్రోత్సహించారు. శ్రీ భగవాన్‌కు



సన్నిహితులూ, చిరకాల భక్తులందరూ యీ పుస్తకాన్ని ఆదరిస్తారని వారి నమ్మకాన్ని వెలిబుచ్చారు. చివరకు, నేను నా హృదయ పూర్వక ధన్యవాదములు అర్పించవలసిన వ్యక్తి శ్రీ ఆర్థర్ ఆస్‌బర్న్‌గారు. స్వామినాథన్ గారు వ్రాత ప్రతి తిరిగి నాకు యిస్తున్న సందర్భములో, శ్రీ ఆస్‌బర్న్ గారు చూసి ప్రతిని తాను తీసుకున్నారు. ఆ రోజు సాయంకాలమే శ్రీమతి ఆస్‌బర్న్ గారితో కలిసి చాలా మట్టుకు చదివేశారు. పుస్తకం వారికి చాలా నచ్చింది. శ్రమకోర్వకుండా మొత్తము పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివి కావలసిన మార్పులూ, చేర్పులూ చేశారు. వారు పడిన శ్రమ శ్రీ భగవాన్ పట్ల వారికున్న భక్తికి తార్కాణము.

ఒకసారి యీ స్మృతులు రాయడం మొదలుబెట్టిన తరువాత, నేననుకున్న దానికంటే పుస్తకం నిడివి చాలా పెరిగిపోయింది. గత స్మృతులు గుర్తు తెచ్చుకుంటూ, శ్రీ భగవాన్ సన్నిధిలో నేను గడిపిన ఆ మరుపురాని రోజులు నెమరువేసుకుంటూ నేను ఆనందంలో మునిగి పోయాను. శ్రీభగవాన్ భక్తులు - పాతవారూ కొత్త వారూ - యీ స్మృతుల వల్ల కొంతైనా లాభము పొందుతారన్న ఉద్దేశముతో ఆశ్రమ యాజమాన్యము యీ పుస్తకాన్ని ప్రచురించడం జరిగింది.

## ఒకటవ అధ్యాయము

శ్రీ భగవాన్ గురించిన నా మొదటి జ్ఞాపకాలు 1900వ సంవత్సరములో అని చెప్పవచ్చును. నేను కొంతమంది బంధువులతో మా బావగారు శ్రీ ఎమ్.సభాపతి ముదలియార్ గారిని చూడడానికి తిరుక్కోయిలూరు వెళ్ళాము. ఆయన ఆ రోజులలో

తిరుక్కోయిలూరు సబ్ మేజిస్ట్రేటుగా వుండేవారు. ఆ సందర్భములో దీపోత్సవం చూడడానికి తిరువణ్ణామలై వెళ్ళాము. నాతో బాటు మరికొందరు చుట్టాలు కూడా వున్నారు. ఆ రోజులలో దీపం చూడడానికి వచ్చిన భక్తులు శ్రీ భగవాన్‌ను చూడడానికి కూడా వచ్చేవారు. వారిని అప్పుడు 'బ్రాహ్మణ స్వామి' అని సంబోధించేవారు.

అందరి లాగానే మేము కూడా శ్రీభగవాన్ దర్శనానికి వెళ్ళాము. సరిగ్గా ఆయనను యెక్కడ చూశామో నాకు గుర్తులేదు. బహుశా విరూపాక్ష గుహలో అయివుండవచ్చును. ఆ రోజులలో శ్రీ భగవాన్ యెవరితో మాట్లాడేవారు కాదు; అసలు యెవరి వంకా చూసేవారు కూడా కాదు. నిరంతరం ఆత్మావశిష్టులై కండ్లు మూసుకొని కూర్చునే వారు. కొద్ది సేపు వారిని చూచి తిరిగి వెళ్ళిపోయాము.

ఆ తరువాత తిరిగి 1914 దాకా వారిని దర్శించలేదు. అప్పటికి నేను చిత్తూరులో స్థిరబడి న్యాయవాదిగా పనిచేయడం మొదలు బెట్టి రెండు సంవత్సరాలయింది. నాకు మొదటి నుండీ మహాత్ములనూ, ఋషులనూ దర్శించాలనే కోరిక ఉండేది. ఈ కోర్కెతో బాటు, ఆ సమయంలో శ్రీభగవాన్ గురించి చాలా మంది ద్వారా వినియుండడం వల్ల, వారిని దర్శించాలనే కోరిక బలపడి, అరుణాచలం వెళ్ళడం సంభవించింది. వెల్లూరులో మా బంధువు శ్రీ వేలపాడి కుప్పుస్వామి ముదలియారు పోలీసుశాఖలో ఉద్యోగం చేసి రిటైరయ్యారు. వారు శ్రీ భగవాన్‌ను తరచూ సందర్శించేవారు.



శ్రీ భగవాన్ గురించి ఆయన నాకు చెప్పేవారు. శ్రీ భగవాన్ ను సందర్శించడానికి ఆయన తన స్నేహితుడు శ్రీ నారాయణరెడ్డి గారితో వెళ్ళేవారు. శ్రీ రెడ్డిగారు చాలా భావోద్వేగమున్న వ్యక్తి. శ్రీ భగవాన్‌నూ, ఆయన బోధనలనూ అందరికీ తెలియపరచడానికి, ఆయన వారి చిత్రపటాలనూ కరపత్రాలనూ ముద్రింపించి పంచి పెట్టేవారు. ఈ పనిలో ఆయన తన శక్తివంచన లేకుండా కృషి చేసేవారు.

నేను 1914లో శ్రీ భగవాన్‌ను చూడడానికి వెళ్ళినప్పుడు శ్రీ కుప్పుస్వామి ముదలియార్ నాతో వచ్చారు. మేము వెళ్ళేసరికి మధ్యాహ్నం రెండు గంటలయ్యింది. శ్రీ భగవాన్ విరుపాక్ష గుహ బయట పిట్టగోడ మీద కూర్చొని వున్నారు. నాకు గుర్తున్నంత వరకూ, మేము వెళ్ళినప్పుడు శ్రీ భగవాన్‌తో యెవ్వరూ లేరు. ఆయన దగ్గర కొన్ని కోతులు మాత్రము వున్నవి. వాటి గురించీ, వాళ్ళ సామ్రాజ్యము గురించీ, వాళ్ళ రాజులూ, రాణుల గురించి శ్రీ భగవాన్ నాతో చెప్పసాగారు. మేము దాదాపు రెండు గంట లున్నాము. ఈ రెండు గంటటూ శ్రీ భగవాన్ కోతుల గురించే మాట్లాడారు. ఇతర ఉద్దేశం యేమీ లేకుండా కేవలం శ్రీ భగవాన్‌ను చూడడానికే వెళ్ళటం వల్ల నాకు యెట్టి నిరాశా కలుగలేదు. శ్రీ భగవాన్‌ను చూడగలిగాననీ, వారితో రెండు గంటలు గడప గలిగాననే సంతోషంతో చిత్తూరు తిరిగి వెళ్ళిపోయాను. కుప్పుస్వామి ముదలియార్ గారు శ్రీ భగవాన్ దగ్గరకు వచ్చి చాలా సంవత్సరా

లయిననూ, శ్రీ భగవాన్ వారిని చక్కగా గుర్తు పెట్టుకొని కుశల ప్రశ్నలు వేశారు.

నేను 1914లో శ్రీ భగవాన్‌ను దర్శించినప్పుడు శ్రీ కుప్పుస్వామి ముదలియార్ గారి ద్వారా వెల్లూరులో అసిస్టెంటు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా పనిచేస్తున్న శ్రీ హంఫ్రీసుగారి గురించి విన్నాను. ఆయన శ్రీ భగవాన్ వల్ల యెలా ఆకర్షితులయినదీ, వారికి కలిగిన అసాధారణమయిన అనుభవాల గురించీ, శ్రీ కుప్పుస్వామి గారు తెలియపరిచారు. ఆశ్రమం వాళ్ళు ప్రచురించిన 'రమణ మహర్షి' అనే పుస్తకంలో యీ వివరాలన్నీ పొందుబరచ బడినవి. ఆ రోజులలో నేనింకా చిన్న వయస్సులో వున్నందున, ఆధ్యాత్మిక జీవితము గురించి నేనెక్కువ ఆలోచించేవాడిని కాదు. శ్రీ భగవాన్‌ను ఆధ్యాత్మిక పరంగా ప్రశ్నించడం గానీ, ఆ విషయంలో ఆయన మార్గదర్శకత్వము కొరకు ప్రార్థించడం గానీ చేయలేదు. వారిని చూడడం, వారితో మాట్లాడటం నాకు పూర్తి సంతృప్తి కలిగించింది.

శ్రీ భగవాన్ విరూపాక్ష గుహలో 1900-1917 ప్రాంతంలో వుండేవారు. వారిని నేను మరియొకసారి అక్కడ దర్శనం చేసుకున్నాను. నేను మూడవసారి వారి దర్శనానికి వెళ్ళేసరికి, శ్రీ భగవాన్ స్కందాశ్రమానికి మారారు. బహుశా 1918 ప్రాంతం అయి వుండవచ్చు. ఈసారి దర్శన విశేషాలు కూడా నాకు యెక్కువ గుర్తు లేవు. మళ్ళీ వారితో రెండు గంటలు కూర్చొని మాట్లాడ కలగడం ఒక్కటే నాకు గుర్తు. *(సశేషం)*



# సాధనా చతుష్టయం

(మౌంటెన్‌పాత్, జనవరి-మార్చ్, 2011 (సంపుటి-48, సంచిక-1)లో డా. జాన్‌గ్రైమ్స్ 'సాధనా చతుష్టయ' అన్న శీర్షికతో రచించిన 'కీవర్డ్' లో ఎన్నుకొన్న భాగాల అనువాదం)

**అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి**

సూటియైన జ్ఞానమార్గాన్ని అనుసరించాలని ఆశించే సాధకులు నాలుగు విధాలైన అత్యవసర గుణాలను కలిగివుండాలని అద్వైత వేదాంత శాస్త్రం చెబుతోంది. ఆ ప్రాథమిక యోగ్యతలు - (1) శాశ్వత, అశాశ్వత వస్తు రూపాల గురించిన వివేచన; (2) ఇహ, పర లోకాలలో తమ కర్మ ఫలితాలను అనుభవించాలన్న కోరిక పట్ల వైరాగ్యం; (3) శాంత స్వభావం, సమతుల్యత, భోగవస్తువుల పట్ల విముఖత, క్షమ, ఏకాగ్రత, గాఢమైన 'నమ్మకం' (శమ, దమాది సాధనా సంపత్తి)లను పుష్కలంగా కలిగి వుండడం; (4) చాలా అమితమైన మోక్ష కాంక్ష (ముముక్షత్వం).

సంప్రదాయం ప్రకారం, ఈ నాలుగు యోగ్యతలను కలిగివున్న వ్యక్తి మాత్రమే వేదాంత మూల గ్రంథాలను అలాంటి విషయాలలో నిష్ణాతుడు, సత్యనిష్ఠుడైన ఆచార్యుని మార్గదర్శకత్వంలో అధ్యయనం చేయడానికి అర్హుడు. ఆదిశంకరాచార్యులు ఈ నాలుగు యోగ్యతలను బ్రహ్మసూత్రాలపై తాము చేసిన వ్యాఖ్యలలోను, అంతకంటే విస్తృతంగా తాము రచించిన వివేకచూడామణి లోను తెలిపారు. ఈ ప్రాథమిక సంసిద్ధత గురించి కైవల్య నవనీతం, ఇతర అద్వైత గ్రంథాలలో కూడ పేర్కొనబడింది.

## నిగూఢ సంస్కారాలు

ఆధ్యాత్మిక సాధనకు ఉత్తమ మార్గమేదని మహర్షిని అడిగినప్పుడు మాత్రం ఆయన టూకీగా వ్యక్తి యొక్క స్వభావాన్ని బట్టి అది వుంటుందని అన్నారు. ప్రతి వ్యక్తీ తన పూర్వజన్మల నిగూఢ సంస్కారాలతో బాటు జన్మిస్తాడు. ఒక వ్యక్తికి ఒక పద్ధతి, మరొకరికి మరొక పద్ధతి అనువైనదై వుండవచ్చు. ఈ విషయంపై ఇదమిత్థంగా సూత్రమంటూ ఏదీ లేదు. అప్పటికే ఆధ్యాత్మికంగా పురోగతి చెందిన సాధకులు, మంచి గురువు ద్వారా సూచనలను పొందితే మరింత తొందరగా గమ్యాన్ని చేరతారు. కొద్దిగా పరిణతి చెందిన సాధకులు కొంత చింతనతో ప్రయత్నాన్ని సఫలం చేసుకోవచ్చు. ఇక మూడవ రకం సాధకులు సంవత్సరాల పాటు సాధన చేయవలసి వుంటుంది.

అద్వైత సిద్ధాంతంలోనే అసలు జ్ఞానమార్గంలో మూడు ప్రత్యేక అంశాలున్నట్లు చెప్పబడుతోంది: (1) శ్రవణం (వినికిడి); (2) మననం (పునరాలోచన); (3) నిదిధ్యాసన (తీవ్రమైన, నిరంతర ఆధ్యాత్మిక ఆలోచన). సాధకుని యోగ్యతలను బట్టి ఫలితం ఆధారపడి వుంటుంది. దేశ, కాలాలు, ఇతర పరిస్థితులు చూచాయగా మాత్రమే సహాయపడగలవు. కొందరి విషయంలో గురువు యొక్క ప్రాథమిక సూచనలు వ్యక్తి యొక్క అంతర ఆత్మను మరుగుపరుస్తున్న కొన్ని లోపాలను సరిచేయడానికై బుద్ధిని పవిత్రీకరించే మరేదైనా సలహాలను తెలియజేస్తాయి. అంటే



అద్వైతంలో ఆధ్యాత్మిక సాధనలు అంతర ఆత్మను సాధించడానికి కాదు. ఎందుకంటే, అప్పటికే వ్యక్తి 'అది'గా వుంటాడు. కాని ఆ ప్రయత్నాలు దాన్ని దాచి మరుగునపడేస్తున్న కల్మషాలను తొలగించడానికి ఉపయోగపడతాయి. శ్రీరమణులు ఈ వాంఛిత యోగ్యతల విషయంలో అభ్యంతరాలు తెలుపలేదు. కాని వారి ఉద్దేశంలో అప్పటికే ఆ యోగ్యత లేకపోతే, ఆధ్యాత్మిక సాధనను ఆశించే వ్యక్తి సఫలమయ్యే మాట అటువుంచి, ఆ దిశలో సాగే అవకాశాలే వుండక పోవచ్చు. ఆత్మాన్వేషణ చేయాలనే గాఢమైన కోరిక వుండడమంటేనే దైవకృప మెండుగా వున్నదని అనుకోవచ్చు.

ఈ ప్రాథమిక కట్టుబాట్లు మనసును శుద్ధపరుస్తాయి. అవి ఏ మాత్రమూ లేని పక్షంలో సాధనను పాటించడం, అడుగున రంధ్రాలు వున్న కుండలో నీళ్ళు పోస్తున్నట్లే. అలాంటి కుండలో ఎన్ని నీళ్ళు (ఆత్మ విచారణ, ధ్యానం మొ)పోసినప్పటికి, సాధన యొక్క ఫలితాలు చిల్లుల కుండలో పోసిన నీళ్ళలాగ వ్యర్థమౌతాయి. కాని, శ్రీరమణులు మాత్రం కట్టుబాట్లు ఖచ్చితంగా వుండితీరాలని నొక్కి చెప్పలేదు. దానికి బదులు సాధకులను సూటిగా "నేను ఆలోచన" యొక్క మూలాన్ని విచారించమని సలహా ఇచ్చారు.

## వాదనలో భేదం

- శ్రీ రమణ మహర్షి అభిప్రాయానికి, సాంప్రదాయ అద్వైత వాదనకు ఒక ముఖ్యమైన భేదం వుంది. సాంప్రదాయ అద్వైత

సిద్ధాంతం మనసును ఉపయోగించి ఆత్మను కనుక్కొనవచ్చునని ప్రతిపాదిస్తుంది. కాని మనసు ప్రాథమికంగా ''నేను-ఆలోచన''ను ఉపయోగించుకొని తనను తానే అధిగమించగలదా? ఇది చర్చించ దగిన విషయం. ఏమైనప్పటికి, రమణుల ఆత్మవిచారణా మార్గం అద్వైతం నుండి అన్ని విషయాలలో కాకపోయినా, ప్రాధాన్యత, అవగాహనల విషయంలో మాత్రం తప్పక విభేదిస్తున్నదని చెప్ప వచ్చు. రమణమహర్షి సూటియైన అనుభవానికి ప్రాధాన్యతను ఇచ్చారేగాని అంతులేని పాండిత్యపరంగా లలితమైన వివరణలను పట్టించుకోలేదు.

శ్రీరమణుల ఆత్మవిచారణామార్గం ''నేను-ఆలోచన'' యొక్క యథార్థతనుగాని, దాని నిజమైన ఉనికిని గాని రూఢిగా చెప్పలేదు. కాని దానికి వ్యతిరేకంగా అద్వైత ఆచారణ ఈ ''నేను-ఆలోచన'' ఉనికిని ధృవపరుస్తుంది. అంతే కాకుండ అది ఆత్మసాక్షాత్కార అన్వేషణలో, ఏకాగ్రత, నిదిధ్యాసన, మొదలైన వాటిపై కేంద్రీ కరించడానికి ఉపయోగపడుతుందని సంప్రదాయ అద్వైత మార్గం భావిస్తుంది. ''ఉన్న దానినే పొందడం (ప్రాప్తస్య ప్రాప్తిః) అన్న ఈ అన్వేషణలో తన పథంలో అన్ని ఇతర పద్ధతుల ఉపయోగాన్ని కూడ అంగీకరిస్తుంది. కాని రమణులు సూచించిన మార్గం నుండి తాత్కాలికంగానైనా సరే విభేదిస్తుంది. ఎందుకంటే, అద్వైత సాధకుడు 'నేను-ఆలోచన'' తోనే లక్ష్యాన్ని సాధించగలడని ఆ శాస్త్రం విశ్వాసాన్ని వెలిబుచ్చుతుంది.



రమణమహర్షి పలు సాధకుల విషయంలో, ఆత్మ విచారణ లోనే అప్రయత్నంగా ''నేను-ఆలోచన'' సంపూర్ణంగా నశించదని గ్రహించారు. అందుకే, అలాంటి వారు పరిస్థితులు, అర్హతను బట్టి కొన్ని ప్రాథమిక కట్టుబాట్లను పాటించి ఊగిసలాడే మనసును పవిత్రీకరించి అదుపు చేసుకోవాలని సలహా ఇచ్చేవారు. ''అన్ని పద్ధతులు కూడ ఆఖరుకు ఆత్మవిచారణకు దారితీసేవే. వాంఛల భ్రమలో పడకుండ వున్న వారికి మాత్రమే ఆత్మదర్శనం సాధ్య మౌతుంది, కాని కోరికలతో నిండి కలుషితమైన మనసులకు అది సాధ్యం కాదు'' అనేవారు.

## ఆత్మాన్వేషణకు అర్హత

సాధనా చతుష్టయంలో పేర్కొన్న లక్షణాలు, పూర్వ యోగ్యతలు వున్నప్పుడే వ్యక్తి ఆత్మాన్వేషణ చేయడానికి అర్హుడవు తాడని అద్వైత శాస్త్రం స్పష్టంగా తెలియజేస్తుంది. వివేక చూడామణి లో ఆ సుగుణాలు 19-29 శ్లోకాలలో ఇవ్వబడ్డాయి. ఆ లక్షణాలను క్రమంగా తర్కయుక్తంగా పేర్కొంటూ ముందుగా చెప్పబడిన ప్రతి లక్షణం ఆ తరువాతి దానికి కారణంగా చూపబడింది. నిరాసక్తత వివేచన లేనప్పుడు వీలు కాదు. సత్యము నుండి అనిత్యాన్ని, శాశ్వతం నుండి అశాశ్వత్వాన్ని, గుర్తించగలిగినప్పుడే నిరాసక్తత లభిస్తుంది. అలాగే నిరాసక్తత నుండి ఇతర సుగుణాలు ఒకదాని నొకటి వెంబడిస్తాయి. ఆఖరుకు అంతర బాహ్యాలకు, సత్యా

సత్యాలకు హద్దులు లేవన్న గ్రహింపు కలగాలి. ముక్తికి ఇది మొదటి మెట్టు మాత్రమే.

ఏది ఎప్పుడూ మార్పు లేకుండ, ఉనికిని పోగొట్టుకోకుండ వుంటుందో అదే సత్యమైనదని ఆదిశంకరులు ఒప్పుకుంటారు. తాత్కాలిక ఉనికిని మాత్రమే కలిగిన ఏ వస్తువూ, ఏ జ్ఞానముగాని కేవల సత్యమని చెప్పడానికి వీలు లేదు. కేవల సత్యమంటే శాశ్వత ఉనికిని కలిగినది మాత్రమే. శాశ్వతత్వానికి, అశాశ్వతత్వానికి మధ్య వివేచన కలిగి వుండడమంటే కేవల సత్యమొక్కటే నిత్యమైనదని గ్రహించడం. మిగితవి అన్నీ అనిత్యాలు, కాలపరిమితికి లోబడినవి, తాత్కాలికమైనవి. ఆలోచనలు అశాశ్వతమైనవని ఖచ్చితంగా గుర్తించాలి. అవి అగుపడతాయి, మాయమౌతాయి. రూపాలు కూడ అశాశ్వతాలు, అవి కూడ కనబడి, కనబడక పోతాయి. ఎంతో ఉత్కృష్టమైన అనుభవాలు కూడ వచ్చిపోతుంటాయి. అందుకే ఒకరి శరీరం, ఆలోచనలు, అనుభూతులు, ఆలోచనలు, వీటిలో దేనినీ పట్టివుంచలేము. సూక్ష్మంగా, అద్వైతమంటే: బ్రహ్మ సత్యం, జగన్ మిథ్య, జీవోబ్రహ్మైవ న పరాః.

### స్పష్టమైన అవగాహన

నిరాసక్తత అంటే తన ప్రయత్నాల ఫలితాలను (ఈ లోకం, లేదా పరలోకంలో) సంతోషంగా అనుభవించాలన్న గాఢమైన కోరిక లేకపోవడం. ఇది వివేచనా శక్తి ద్వారా లభిస్తుంది గాని, దుఃఖం లేదా అధైర్యం దానికి కారణం కాదు. సాధకునికి అలాంటి అనుభవాలు అశాశ్వతం, అందుకే శాశ్వత ఆనందాన్ని ఇవ్వలేవన్న స్పష్టమైన అవగాహన వల్ల ఏర్పడిన పరిస్థితి. ఇక శాంత స్వభావం భోగవస్తువుల లోపాలను గుర్తించి, ఒక లక్ష్యం-ఆత్మ-పై కేంద్రీకరించడం. స్వీయ-అదుపు అంటే కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ కేంద్రాల నుండి ధ్యాసను వెనుకకు మరలించడం. క్షమ అంటే అన్ని బాధలను ఓర్చుకుని పగ గురించి తలచకుండ, దుఃఖం, విచారం లేకుండ వుండడం. పవిత్ర గ్రంథాల భోధనా వాక్యాలు, గురువుల ఉపదేశాలను హృదయపూర్వకంగా నిజమని అంగీకరించడమే 'నమ్మకం'. ఏకాగ్రత అంటే మనసును సంపూర్ణంగా శుద్ధకేవల సత్యంపై నిలిపి దానిని మామూలు పోకడలలో మునగకుండ ఉంచడం.

(వీటి గురించి) శ్రీరమణులు "మంచి నడవడి మంచిదని, అది ఆఖరుకు లక్ష్యానికి త్రోవచూపుతుందని ఎవరు కాదంటారు? సక్రమమైన నడవడి చిత్తము (మనసు)ను శుద్ధి చేసి, పవిత్రమైన మనసును ఇస్తుంది. అలాంటి మనసు జ్ఞానాన్ని పొందుతుంది. మోక్షమంటే అదే" అన్నారు.

**ఆత్మ యొక్క ఆనందం ఎల్లప్పుడూ నీదే. దృఢంగా నీవు దాని గురించి ప్రయత్నించినచో దానిని నీవు పొందెదవు. నీ దుఃఖ హేతువు, నీయందే, నీ అహంకార రూపంగా వున్నది. అది నీ బాహ్య జీవితమునందు లేదు. - శ్రీరమణ మహర్షి**

# శ్రీరమణ మానసము

బిరుదువోలు లక్ష్మమ్మ

15. కం. మలినపు వాసన లెన్నియొ
పలువిధముల వచ్చు నీవు భయపడ నేలా
నిలుచునె రవిమును చీకటి,
తలపుల రమణేశు జేర్పు ధన్యవు మనసా ॥

16. కం. గట్టిగ రమణుని పదముల
పట్టుచు హృదయంబు నందు పదిలము సేయన్
గుట్టుగ నిలిచిన వాడే
గట్టును జేర్చంగ గలడు గదవే మనసా ॥

17. కం. కరుణామయములు చూడ్కులు
నిరతము నుపదేశ మెసగు నింపగు పల్కుల్
పరులెడి దరహాసంబులు,
శరణను, రమణుండు దీను సాకును మనసా ॥

18. కం. అలశంకరు లీలలు భువి
తెలుపగ గురుజనులు వింటి దీరని ప్రేమన్
ఇల, నా భాగ్యమె చూడగ
గలిగె .. రమణేశు చెంతగదవే మనసా ॥

19. కం. సుందర నందను లీలలు
పొందుగ నెఱిగింతు రమ్మ పూజ్యతములచే
డెందము సంతస మందగ
విందువు నిటు రా గదమ్మ వేడ్కన్ మనసా ॥



20. కం. బాలుర పతితుల దీనుల
చాల చరాచరుల జీవసముదాయంబున్
మేలగు గారవ మెసగన్
పాలన మొనరించు రమణ ప్రభుడే మనసా ॥

21. కం. తామసగుణ సంభవులగు
పామరు లౌ దీనజనుల బక్ష్వము సేయన్
వేమరు బుద్ధులు సెప్పుచు
కామితముల గూడ నొసగి కాచునె మనసా ॥

22. కం. ఎన్నో విధముల మొఱలన్
విన్నపముల జేసి నిలువ పిన్నగ నవ్వున్
తిన్నగ దీనన్ భావము
క్రన్నన యోచించి పల్క గదవే మనసా ॥

23. కం. ఫలమైన దోయమైనను
వలపక్షము లేక తెచ్చు వారిని గరుణన్
చెలగుచు రమణుడు చేకొను
కలదే యీసమత యెందు గాంచవు మనసా ॥

24. కం. ఒకపరి చూచిన జాలును
ఒకపరి మాటాడ జాలు నూరక లోలో
వికవిక రేగెడు సహమున్
చెక చెక నణగంగ తుక్కు సేయును మనసా ॥

25. కం. శ్రీరమణా రారాయని
సారెకు మదిలో దలంచి సద్గురు మూర్తిన్
తీరుగ భజియింపగదే
గారవమున నతని కరుణ గాంతువు మనసా ॥

26. కం. కల్లగదే యీలోకము
తెల్లముగా చూడు చూడు తెలియన్ గదవే
అల్లన నటునిటు చూడక
యుల్లములో రమణు నమ్మి యుండవె మనసా ॥

27. కం. ఉత్సాహము సుఖ మొసగును
ఉత్సాహము కార్యదీక్ష నొందగ జేయున్
ఉత్సాహము దరి జేర్చును
ఉత్సాహంబునకు నీడు నుండునె మనసా ॥

28. కం. ముందటి భక్తుల వలెనె, న
మందవిధిన్ రమణుగొల్చి యానందింపన్
డెందాన గోర్కె గల్గెను
పొందుదునే యాసుఖంబు పుడమిన్ మనసా ॥

29. కం. అలలవలె వచ్చుచున్నది
తలపుల తుదిలేని వరుస, తప్పని సరిగా
పలు తెఱగుల బాధించెడి,
తెలుపవె నేదాని గెల్చు తెఱగున్ మనసా ॥



# అందరూ శవవాహకులే

(మౌంటెన్‌పాత్, ఏప్రిల్-జూన్, 2007 (సంపుటి-44, సంచిక-2)లో శ్రీమతి టి.ఆర్. కనకమ్మాళ్ గారి రచన "ద అన్ ఎక్స్‌పెక్టెడ్ ఫీస్ట్" యొక్క అనువాదం)

**అనువాదం శ్రీవత్సస:**

ఒకరోజు ఇద్దరు నిరుపేదలైన బ్రాహ్మణులు రమణాశ్రమం హాలులోనికి వచ్చారు. వారు సాంఘికంగా నీచమైనదిగా భావించబడే శవవాహక వృత్తితో జీవనాన్ని గడుపుతున్న వాళ్ళు. అప్పుడే తమ పనిని ముగించుకుని వచ్చిన వాళ్ళు ఆకలితో అలమటిస్తున్నారు. ఆచారం ప్రకారం, మరణం సంభవించిన గృహాన్ని సందర్శించిన వాళ్ళు ఆ ఇల్లు వదలి వచ్చిన వెంటనే స్నానం చేయాలి. ఈ నియమం స్మశానాన్ని ప్రవేశించిన వాళ్ళకు, ముఖ్యంగా శవాన్ని భౌతికంగా అక్కడికి చేరవేసిన వాళ్ళకు మరింతగా వర్తిస్తుంది.

స్నానం చేయకుండ ఆశ్రమంలోనికి వచ్చి అక్కడ భోజనం చేయడం ఎంత సబబు అన్న విషయమై వాళ్ళు తీవ్రంగా చర్చించు కున్నారు. అందులో ఒకరు ఈ ప్రాచీన కట్టుబాటును పాటించక పోవడం తప్పు, అని భావిస్తుంటే, రెండవ వ్యక్తి తాము తీవ్రమైన ఆకలితో వున్నాము, గత్యంతరం లేదని అభ్యంతరాన్ని త్రోసి పుచ్చాడు. తమ ఇళ్ళకు వెళ్ళే దారిలో ఆశ్రమం వున్నందున, అక్కడ ఆహారం దొరుకుతుందన్న నమ్మకంతో లోపలికి వచ్చి హాలులో కూర్చున్నారు. ఉద్రేకంతో వారిలో ఒకరు భగవాన్‌తో, "స్వామీ, మేము భోజనానికి కూర్చునే ముందు సంప్రదాయం ప్రకారం స్నానం చేయాలని చెబుతున్నాను. అదే, సరియైనది, న్యాయమైనది కదా?"

అన్నాడు. భగవాన్ మృదుస్వరంతో, "నీవు చెప్పింది తప్పని ఎవరూ అనలేరు" అన్నారు. వెంటనే రెండవ వ్యక్తి ఆవేశంతో, "మా ఆకలి ఎంత తీవ్రంగా వుందంటే, ప్రేవులు తినేస్తోంది. ఆకలి అంతగా బాధిస్తున్నప్పుడు భోజనం చేయడం తప్పా?" అని భగవాన్‌ను ప్రశ్నించారు. భగవాన్ నెమ్మదిగా, "తప్పని ఎవరంటారు? కానే కాదు" అన్నారు. దాంతో వాళ్ళిద్దరూ దిగ్భ్రమ చెంది, ఒకే స్వరంతో, "అయితే మాలో తప్పెవరిది?" అన్నారు.

జవాబుగా భగవాన్, "మీరు మాత్రమే శవవాహకులని అనుకోకండి, ఈ జీవంలేని శరీరాలను భరిస్తున్న మనమందరము శవవాహకులమే. ఈ శరీరం యథార్థానికి ఒక శవం. అందరూ, "నేను-నేను" అంటూ దాన్ని మోస్తున్నాం. 'ఈ శరీరమే నేను' అన్న భావనతో వున్న ప్రతి ఒక్కరూ శవవాహకులే. ఆ భావాన్ని అధిగమించనంతకాలం వ్యక్తి శవవాహకుడిలాగ అంతే అశుచిగా, అపవిత్రంగా వుంటాడు. ఈ శవాన్ని మోస్తున్న అశుచి ఏ చెరువులో స్నానం చేసినప్పటికీ తరిగిపోదు. ఆత్మ అనే పవిత్ర జలంతో స్నానం చేయడమే ఈ అపవిత్రతను తొలగించుకునే ఏకైక మార్గం" అన్నారు.

ఆ బ్రాహ్మణులు తాము నిర్దోషులమని ప్రకటించబడినట్లు మొదట భావించినప్పటికి, ఉలిక్కిపడి ఒకరినొకరు తేఱిబాఱ చూసుకుంటూ వుండి పోయారు. ఒక్క క్షణంలో అక్కడి వాతావరణ మంతా మారిపోయింది! అందరూ ఏ మినహాయింపు లేకుండ అపవిత్రులే! అందరూ ఆ విధిని పంచుకున్నవారే. తాము



సాంఘికంగా హీనమైన వారు కామన్న ఎఱుకతో వారిద్దరూ ఉత్సాహ వంతులయ్యారు. ఎంతో నేర్పుతో, తామిద్దరికీ, అక్కడ వున్న అందరికీ ఆత్మబోధ, నిత్య శాశ్వత సత్యం భగవాన్ తెలిపినందుకు సంతోషించారు. ఎప్పుడూ అక్కడే వుంటూ వచ్చిన సాధకులకు, సందర్శకులకు మధ్య ఏ భేదభావం చూపించని భగవాన్ సమదృష్టిని గమనించి చాలా ఆశ్చర్యపడ్డారు. ప్రతి ఒక్కరూ చనిపోయి తీరుతారని అందరికీ తెలుసు. కాని చనిపోక ముందే ఆత్మజ్ఞానమన్న జలాలతో స్నానం చేయకుంటే, నేను శరీరం అన్న ఊబిలో పడి, ఈ జీవం లేని శరీరాలను మోస్తుంటాము. అప్పుడు హాలులో వున్న అందరికీ కనువిప్పు కలిగింది. ఆ ప్రక్క క్షణంలో ఇద్దరు బ్రాహ్మణులు అక్కడ లేరు. వాళ్ళు భోజనం చేశారో లేదో ఎవరికీ తెలీదు. ఒకటి మాత్రం నిశ్చయం. వారి ఆధ్యాత్మిక క్షుద్బాధకు భగవాన్ పలుకులు అనుకోని విందును అందించాయి.

స్కంద పురాణంలోని గురుగీత సాక్షాత్కారం పొందిన గురువు యొక్క విశిష్ఠమైన గొప్పదనాన్ని ఇలా శ్లాఘిస్తుంది: గురువు నివాస స్థలమే కాశీక్షేత్రం. ఆయన పాద జలాలు స్వయంగా గంగోదకం. గురువు పాదచ్ఛాయలు గయలోని అక్షయ వటవృక్షం, ప్రయాగ పావన జలాలు. అలాంటి గురువుకు పదేపదే నమస్కారాలు.

బ్రహ్మన్ ప్రత్యక్ష రూపమైన భగవాన్ యొక్క చూపు అత్యంత పవిత్ర జలాలతో సమానం. ఇక ఆ ఇద్దరు శవవాహకులు భగవాన్ దర్శనానికి వచ్చిన వెంటనే పవిత్రులయ్యారనడాన్ని మనం సందేహించాలా?

# The Greatness of Gandhiji

## Talk 136

Dr. K. Subrahmanain

We shall be celebrating Gandhiji's birthday on 2nd October. He was one of the greatest men the world has ever produced. Talking about Gandhiji, Einstein said, "Generations to come will not believe that such a man walked on earth." Because we are rather close to the events, we cannot really appreciate the extraordinariness of the phenomenon that was Gandhiji. What he did for our country, and for the world cannot be adequately described in words. Sarojini Naidu, who had great admiration for Gandhiji and the Maharshi said, "There were two people in this century who were remarkable in their own way. One never let other people rest. He worked, and he made other people work all the time. He never gave rest to himself or to others. There was another person who gave rest to the mind, and to the body of the people." The first one was Gandhiji, and the second was the Maharshi.

The Mahatma was a great *karma yogi* with great faith in God. The Maharshi, on the other hand, was a *jnani*. He used to say that what Gandhiji was doing was the work of God. Gandhiji never said that he was doing anything of his own accord; he repeatedly maintained that he was only an instrument made use of by God. Gandhiji gave elaborate instructions on day-to-day living; how to overcome problems, etc. The Maharshi went to the root



of the problem and said, "If you find out who you are, there won't be any problems."

Gandhiji had total adherence to truth and had implicit faith in God. Once when he was fasting, the attending doctor said to him, "You are getting weak. There are some stones in your urine." Gandhiji said, "It is all right. Don't worry. Everything will happen according to God's will." The doctor said, "I'm telling you a scientific fact. I am not talking to you about God." Gandhiji said, "You seem to have more faith in science than in God. It is very sad. Anyway, what is to happen, will happen. You don't have to worry." Nothing did happen. This was not the only instance; there were hundreds of such instances in his life. He was an ordinary person who rose to extraordinary heights through sheer will power.

Another instance of his implicit faith in the Lord occurred when he was 40 years of age. Gandhiji was deeply convinced that everything happens as it happens because of the will of God; he therefore, decided to depend only on God and on no one else. He surrendered the life insurance policy he had earlier taken saying, "I believe in Him. I believe He will look after my family after I am gone." In those days, if you didn't pay your premium, the policy lapsed; there was no surrender value for it of the kind we have now. The Mahatma felt that if he continued to pay the premium on the insurance policy, it meant that he didn't have adequate faith in the Lord.

